శ్రీమతి కోపూరి మాణిక్యమ్మ స్మారక కథలపోటీలో

తృతీయ బహుమతి పొందిన కథ...

# గోడ గడియారం

ఎస్. విజయలక్ష్మి

స్టడీరూమ్‌లో తలుపుకి పైన గోడ మీద వేళ్ళాడుతున్న గోడగడియారం నా కళ్ళకి గురువులాగా చదవండి! ఆపేశారేం? అని గంటల ముల్లుతో బెదిరిస్తూ గురువు చేతిలో ముల్లు కర్రలా అనిపిస్తుంది. ఒక్కొక్కసారి గడియారాన్ని చూస్తుంటే, కోపం వస్తుంది. ఆడుకునే సమయంలో త్వరగా పరుగెడుతుంది, చదువుకునేటైంలో ఎంతకీ కదలదు. నా కళ్ళన్నీ గోడగడియారంపైనే వుండి ఎప్పుడు 7-30 గం॥ అవుతుందా, అమ్మ ఎప్పుడు భోజనానికి పిలుస్తుందా అని, కారణం వంటింట్లోనుండి కమ్మటి వాసనలు వస్తున్నాయి. నాతో పాటు తమ్ముడు యిద్దరు చెల్లెళ్ళు ఎదురు చూస్తున్నారు.

“అమ్మా ఏడున్నర అయ్యింది భోజనానికి రావాలా” కూర్చున్న దగ్గరి నుండే అరిచాను.

“వద్దు! అన్నయ్య ట్యూషన్ నుండి రానివ్వు” వంటింటి నుండే అమ్మ జవాబు.

పనికి అంతరాయం కలిగిందేమో నాన్న టైపు చేయటం మానేసి నా వైపు చూసారు. నాన్న ఆఫీసు పని యింట్లో కూడా చేస్తుంటారు. నేను మెల్లగా తలవంచుకున్నాను.

ఉదయం లేచిన దగ్గరి నుండి రాత్రి పడుకునే వరకు ‘నేనున్నాను’ అని కొరడాలా ఝుళిపించే సాక్షి భూతం గోడగడియారం.

ఆ గోడగడియారం అంటే నాన్నకి ప్రాణం అది తరతరాలుగా వస్తున్న ఆస్తి యిప్పటికే దానికి నూటయాభై యేళ్ళు నిండాయి. అని నాన్న చెప్తుంటారు. ప్రతీ దసరాకి ఆయుధ పూజ రోజు నాన్న గడియారం తుడిచి, బొట్టు పెట్టి పూలదండ వేస్తారు. అలాగే గాంధీజయంతి రోజు గాంధీతాత ఫోటోకి బొట్టుపెట్టి, దండవేసి ఆరోజు అమ్మతో పాయసం చేయించేవారు. ఉదయం లేస్తూనే నాన్నచేసే ముఖ్యమైన పనుల్లో ఒకటి క్యాలెండరులో పేజీ తిప్పటం, గోడగడియారానికి ‘కీ’ యివ్వటం. అప్పుడు మొదలవుతుంది ఆయన దినచర్య.

గోడగడియారం గురించి నాన్న కథలుగా చెప్తుంటారు. ఒకసారి గడియారం ఏడుగంటల దగ్గర ఆగిపోతే టైమ్ కాలేదనుకొని స్కూలుకి లేటుగా వెళ్ళి గోడకుర్చీవేసిన సంగతి చెప్పి నవ్విస్తారు. ఒకసారి తాతయ్య కోర్టుపనికి అర్జెంటుగా వెళ్ళాల్సి వస్తే తొమ్మిది గంటలు కొట్టాల్సిన గడియారం ఎనిమిది గంటలే కొట్టిందంట. తీరా కోర్టుకి వెళ్ళేసరికి ఆలస్యం అయిపోయిందని కేసు వాయిదా పడింది. తాతయ్యకి కోపం వచ్చి యింటికి రాగానే గోడ గడియారాన్ని తీసేసి పాత సామాన్లల్లో పారేస్తుంటే నాయనమ్మ దాన్ని తీసి జాగ్రత్త పెట్టి నాన్నకి పెళ్ళయిన తరువాత ఇచ్చిందట. అప్పటినుండి నాన్న ఆ గడియారాన్ని వాళ్ళ అమ్మని చూసుకున్నంత ప్రేమగా చూసుకుంటారు.

ఒకరోజు నాన్న ఉదయం కీ ఇవ్వటానికి వెళ్ళే సరికి అది రాత్రి 11 గం॥ దగ్గర ఆగిపోయింది. అయ్యో! కీ బాగానే యిచ్చాను ఎందుకు ఆగి పోయిందో ? అని అనుకుంటూ ఏమిటో సరోజా నా మనసు కీడుని శంకిస్తుంది అన్నారు. ఆ!! అన్నీ

మీకు అనుమానాలె అని నాన్న మాటని కొట్టి పారేసింది అమ్మ. సంభాషణ పూర్తి కాక మునుపే 'టెలిగ్రామ్' అన్న కేక వినిపించింది. నాన్న గబగబా వెళ్ళారు.'నైట్ శ్యామలా ఎక్స్‌పైర్డ్ స్టార్ట్ ఇమీడియట్‌లీ' అని ఇచ్చారు. నాన్న దృష్టిలో అది ఒక భవిష్యవాణి

నాన్నకి అన్నీ టైం ప్రకారం జరగాలి. ఏమాత్రం తేడా వచ్చినా మమ్మల్ని ఏమీ అనేవారు కాదు అమ్మని తిట్టేవారు. అమ్మ, నాన్న ముందు ఏమీ అనేది కాదు నాన్న ఆఫీసుకి వెళ్ళిన తరువాత బట్టలు ఉతికినట్లు ఉతికి పారేసేది. అప్పుడప్పుడు గోడగడియారాన్ని తిట్టుకున్న రోజులు లేకపోలేదు.

కాలచక్రంలో కాలం ఎంతో స్పీడుగా తిరిగి పోతుంది. నాకు, అన్నయ్యకి, చెల్లికి పెళ్ళయి పోయింది. ఒక చెల్లెలు పెళ్ళికి వుంది. నాన్న రిటైర్డు అయిపోయారు. కానీ గడియారానికి 'కీ' యివ్వడం మానేయలేదు. పోనీలే నాకు ఈ పనైనా మిగిలింది అంటుండేవారు మళ్ళీ ఒకరోజు గడియారం ఆగిపోయింది. సరోజ! గడియారం ఆగిపోయిందే అన్నారు ఎంతో బాధగా.

అవును మరి దానికి నూరేళ్ళు నిండిందిగా అన్నది అమ్మ హాస్యంగా. కానీ నాన్న మనసులో ఏదో బాధ. అమ్మ అనారోగ్యానికి గురి అయ్యింది. నెల తిరక్కుండా అమ్మ కాలంచేసింది.

చూశావా! అమ్మడు తనకి నూరేళ్ళు నిండుతుందన్న విషయాన్ని ఎలా మర్మంగా చెప్పిందో అన్నారు నాతో. నాగుండె పిండినట్టయింది. నాన్నని ఓదార్చటానికి నాకు మాటలు కరువయ్యాయి.

ఒకరోజు అన్నయ్య కొడుకు నిశాంత్, నా కొడుకు అంకిత్ ఆడుకుంటూ వుండగా బాలు పొరపాటున గడియారానికి తగిలి అద్దం విరిగిపోయింది పిల్లల్ని తిట్టకుండా తనలో తానే గొణుక్కుని అన్నయ్యని పిలిచి, ఈ గడియారానికి కాస్త అద్దం వేయించు అని అడిగారు.

ఎందుకు నాన్న పాత వస్తువు కోసం అంత పాకులాడుతావు? అని బ్యాటరీతో నడిచే గడియారం తెచ్చిపెట్టాడు అన్నయ్య. నాన్నకి ఆ గడియారం నచ్చలేదు, నన్ను పిలిచి అమ్మడు మీ ఆయనతో చెప్పి దీనికి అద్దం వేయించిపెట్టు డబ్బులు యిస్తాను అన్నారు. ఆ మాటకి నాకు బాధ కలిగింది సరేలే నాన్న అని వెళ్ళిపోయాను. కృష్ణతో చెప్పాను. కృష్ణ వెంటనే దానికి అద్దంవేసి తెచ్చి పెట్టాడు. అప్పుడు ఆయన కళ్ళల్లో వెలిగిన వెలుగు వెయ్యి సూర్య కాంతులకి సరిపోదేమో.

అందరికంటే నాన్నకి నేనంటే ఎక్కువ ఇష్టం. ఏది చెప్పాలన్నా నాకే పిలిచి చెప్పేవారు. అన్నిటికి నన్నే సంప్రదించేవారు. నేను ఎక్కడో దూరంగా వుండటం ఇష్టం లేదు. అందుకే అన్నయ్య యింటికి దగ్గర్లోనే యిల్లు అద్దెకి తీసుకొని వుంటున్నాను. రోజు నాన్నని పలకరించి రావటానికి వెళ్ళి వస్తూ వుండేదాన్ని ఈ మధ్య నాన్న ఆరోగ్యం బాగుండటం లేదు. మునుపటి వుత్సాహం తగ్గింది. ఉదయాన్నే లేచే అలవాటున్న నాన్న ఆలస్యంగా లేస్తున్నారు. నేను వెళ్ళే సరికి యింకా లేవలేదు. నేను వెళ్ళి లేపాను.

నాన్నా ఏమిటి యింకా పడుకున్నావు ఆరోగ్యం బాగాలేదా? డాక్టరు గారిని పిలవమంటావా అని అడిగాను.

ఏంలేదమ్మా బాగానే వున్నాను. రాత్రి ఎందుకో నిద్రపట్టలేదు అన్నారు. లేచి కాలకృత్యాలు తీర్చుకొని కాఫీ త్రాగి యధా ప్రకారం గడియారానికి 'కీ' యివ్వడానికి కుర్చీ ఎక్కి పడ్డారు. కాలు కాస్త మడతపడింది. లేచి అడుగు వెయ్యలేకపోయారు. అన్నయ్యకి కోపం వచ్చింది.

ఎందుకు నాన్న పాతగడియారాన్ని పట్టుకొని వేళ్ళాడతావు? నీకు వేరే గడియారం తెచ్చిపెట్టానుగా అయినా టైం ప్రకారం నడవటానికి నువ్వేమైన ఆఫీసుకు వెళుతున్నావా? అని వెళ్ళిపోయాడు. నాన్న మొహం చిన్నబోయింది. అన్నయ్య మాటకి నాకే బాధ అనిపించింది.యింటికి వెళ్ళిన తరువాత అన్నయ్య యిలా మాట్లాడాడు అని కృష్ణతో చెప్పాను. కృష్ణ ఏమనుకున్నాడో ఏమో సాయంత్రం ఆఫీసునుండి వస్తూ ఒక చిన్ని టేబుల్ తెచ్చి, దాని మీద గోడగడియారం పెట్టి నాన్న మంచానికి దగ్గరగా పెట్టారు. అదిచూసి నాన్న మొహం చిచ్చుబుడ్డిలా వెలిగిపోయింది.

నాన్న నాతో ఎప్పుడు అంటుండేవారు నువ్వు ఎక్కాలు ఎలా నేర్చుకున్నావో తెలుసా అని. రోమన్ అంకెల్లో వున్న గడియారం అంకెలను ఇంగ్లీషు అంకెలుగా తర్జుమా చేసుకొని జ్ఞాపకం పెట్టుకోవటానికి నాకు పదిహేను రోజులు పట్టింది ఆ తరువాత రోజు ఆ అంకెలు చూపిస్తూ ఎక్కాలు నేర్పారు నాన్న. రెండో ఎక్కం నుండి పన్నెండో ఎక్కం వరకు. నిజం చెప్పాలంటే గడియారానికి మాకూ చాలా అనుబంధమే వుంది.

ఆరోజు అర్ధరాత్రి రెండు గంటలకి తలుపులు దబదబ బాదుతున్న చప్పుడికి జడుసుకొని, నేను కృష్ణా యిద్దరం ఉలిక్కిపడి లేచాము. సిటీలో దొంగలభయం ఎక్కువ. నువ్వు ఆగు! నేను వెళ్ళి చూస్తాను అని కృష్ణా లైటు వేసి పడకగదిలోనుండి బయటికి వచ్చారు.

కృష్ణా! కృష్ణా! అని అన్నయ్యగొంతు కంగారు, కంగారుగా వినిపిస్తుంది. తలుపు తియ్యగానే అన్నయ్య నా చెయ్యి పట్టుకొని నాన్న పలకటంలేదు అని ఏడుస్తున్నాడు. ఒక్కక్షణం నాకు నోట మాట రాలేదు. ఏడవకు అన్నయ్య పద ఏమయ్యిందో చూద్దాము అని యింటికి తాళం పెట్టి వెళ్ళాము. వెళ్ళి చూసే సరికి నాన్న నిర్జీవంగా పడివున్నారు నాకు తెలియకుండానే నా కళ్ళు గడియారం మీద. ఒక్కటే ముల్లు కనిపిస్తుంది. ఆ ముల్లు అక్కడ ఆగిపోయింది. గోడ గడియారం పెండ్యులమ్ ఆగిపోయింది. నాన్న గుండెలో పెండ్యూలమ్ కూడా ఆగిపోయింది. నాన్న గుండెల మీద వాలిపోయాను.

నువ్వలా నాన్నను వాటేసుకొని గంటల తరబడి వుండిపోతే ఎలా? లేచి తరువాత జరగాల్సిన పనేమిటో చూడు అన్న కృష్ణా మాటలకు గోడ గడియారంతో నాన్నకి వున్న అనుబంధం నుండి బయటపడి, నెమ్మదిగా లేచి వెళ్ళి ఒక్కొక్కరికి కబురు చేయటం మొదలుపెట్టాను. జరగవలసిన తతంగం అంతా జరిగిపోయింది. ఎటు చూసినా నిశ్శబ్దం. నాన్న యికలేరన్న పచ్చినిజం గుండెల్ని పిండేస్తుంది. పన్నెండు గంటల దగ్గర ఆగిపోయిన గోడగడియారం 'కీ' యిచ్చేవారు లేక ఒంటరిగా మిగిలిపోయింది. ఖర్మకాండలన్నీ అయిపోయాయి. ఎక్కడివాళ్ళు అక్కడికి వెళ్ళిపోయారు. కాలం యథావిధిగా తన విధిని నిర్వహిస్తుంది. కాలానికి దేనితోనూ పనిలేదు అది ఎవరి కోసం ఆగదు. కాలం ఆగని ప్రవాహం మనం అందులో పడి కొట్టుకు పోవల్సిందే.

ఒక రోజు చిన్నా పాత న్యూస్ పేపరు పట్టుకొని పరుగెడుతున్నాడు చిన్నా! ఏమిటా పరుగు? పడిపోతావు అని అంటున్నా వినిపించుకోకుండా వెళ్ళిపోయాడు; ఏమిటో తెలుసుకోవాలని కృష్ణా షర్టువేసుకొని వెళ్ళారు. నేను వంటపనిలో పడిపోయాను.

గంట తరువాత కృష్ణా, చిన్న యిద్దరూ కలిసి వచ్చారు. కృష్ణా చేతిలో గడియారం. మీ అన్నయ్య పాత సామానుల వాడికి అమ్మేస్తే నేను వాడి దగ్గర నుండి కొని తీసుకువచ్చాను. ఎప్పుడు 'ఓల్డ్ ఈజ్ గోల్డ్' అంటుంటావు కదా! మీ నాన్న అంటే నీకు యిష్టం కదా! మీ నాన్నను తెచ్చివ్వలేనుగాని మీ నాన్నకి ప్రాణమైన గడియారాన్ని తెచ్చాను అని గడియారం నా చేతిలో పెట్టగానే నా కళ్ళల్లో గిర్రున నీళ్లు తిరిగాయి. ఏం చేసినా నా భర్త ఋణం తీర్చుకోలేననిపించింది. రెండు కన్నీటి చుక్కలు అద్దం మీద పడ్డాయి. దుమ్ము పట్టిన అద్దాన్ని చీర కొంగుతో తుడిచాను. అద్దంలో నుండి రోమన్ అంకెలు ప్రేమతో పలుకరించాయి.